సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 8, నవంబర్, 2023



కల్యాణం.. కమనీయం


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది.



ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం

పరవాడ పోలీసులు ఓ ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై ఎస్పీ స్పందించి క్రమశిక్షణ చర్యలు చేపట్టారు..

IIలో



12 నుంచి ఆర్జిత సేవలు రద్దు

సింహగిరిపై ఈ నెల 12 నుంచి 16 వరకు తిరునక్షత్ర పూజలు నిమిత్తం ఆయా తేదీల్లో ఆర్జితసేవలు రద్దు చేసినట్టు ఈవో తెలిపారు.

IIలో

గిరి పుత్రులకు ఉసిరి

అటవీ ఫలసాయాల్లో ఉసిరి కూడా గిరిజనులకు మంచి ఆదాయన్నిస్తోంది. అటవీప్రాంతాల్లో సేకరించిన ఉసిరిని కాయలు, పప్పు రూపంలో విక్రయిస్తున్నారు. ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి పప్పు కొనుగోలు ప్రారంభించింది. ప్రస్తుతం కిలో రూ.80 ధర చెల్లిస్తోంది. ఉసిరిపప్పునకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున ధర పెరిగే అవకాశం కూడా ఉంది.

- అటవీ ప్రాంతంలో విస్తారంగా ఉసిరి వనాలు
- ఫలసాయం సేకరణలో నిమగ్నం
- కాయలు, పప్పు రూపంలో విక్రయం
- కొనుగోలు చేపట్టిన జీసీసీ
- ఈ ఏడాది కిలోకు రూ.80 చెల్లింపు



అటవీ ప్రాంతంలో విరగ్గాసిన ఉసిరి



గిరిజనులు అమ్మకానికి సిద్ధం చేసిన ఉసిరిపప్పు

సాక్షి,పాడేరు: జిల్లాలో ప్రధాన అటవీ ఫలసాయమైన ఉసిరికాయలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. నాటు ఉసిరి కావడంతో ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయని నమ్మకం. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లలో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతాల్లో పూర్వం నుంచి ఉసిరి చెట్లు భారీగా ఉన్నాయి.

వీఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో పెంపకం

అటవీశాఖ కూడా వనసంరక్షణ సమితులు పరిధిలోని అటవీ ప్రాంతాల్లో దాదాపు 30 ఏళ్ల నుంచి ఉసిరి పెంపకాన్ని నిరంతరం చేపడుతోంది. అటవీ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న ఉసిరిచెట్లకు ఈ ఏడాది కూడా కాపు అధికంగా ఉంది. అటవీ ఫలసాయాన్ని సేకరిస్తున్న గిరిజనులు ఉసిరి కాయలు, పప్పు రూపంలో అమ్మకాలు జరుపుతున్నారు.

సేకరణలో గిరి రైతులు

ఔషధ గుణాలున్న ఉసిరి వాడకం అధికంగానే ఉంది.తెలుగు రాష్ట్రాలతో పాటు గుజరాత్, ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాల్లోని ఫార్మా కంపెనీలు, ఆయుర్వేద మందుల తయారీదారులంతా ఉసిరిని కాయలు, పప్పు రూపంలో ఏటా ఏజెన్సీలో భారీగా సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో ఉసిరి కాయల సీజన్ కావడంతో గిరిజనులంతా ఉసిరి కాయలను సేకరించి వాటిని బాగా ఉడకబెట్టి పప్పు రూపంలో తయారు చేస్తున్నారు. బాగా ఆరిన తర్వాత ఉసిరి పప్పును వారపుసంతలతో పాటు గిరిజన సహకార సంస్థకు కూడా విక్రయిస్తున్నారు.

అమ్మకాలు ప్రారంభం

జిల్లాలో ఉసిరి పప్పు అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గతేడాది కిలో రూ.80 ధరకు 4,359 కిలోలు కొనుగోలు చేసిన జీసీసీ ఈఏడాది కూడా రూ.80 ధరతో ఉసిరి పప్పు కొనుగోలును ప్రారంభించింది. ప్రైవేటు వ్యాపారులు కూడా వారపుసంతల్లో పోటా పోటీగానే ఉసిరి పప్పు కొనుగోలు చేస్తున్నారు. ఉసిరిని కాయ రూపంలో విక్రయిస్తుంటే కిలోకు రూ.10 నుంచి రూ.20 మాత్రమే ఆదాయం వస్తోంది. అదే ఉసిరి పప్పు తయారు చేసి విక్రయిస్తే మంచి ఆదాయం లభిస్తోందని గిరి రైతులు తెలిపారు. పర్యాటకులు కూడా ఉసిరిని కొనుగోలు చేయడంతో గిరిజనులకు మంచి ఆదాయం లభిస్తోంది.

గిట్టుబాటు ధరకు కొనుగోలు

ఉసిరి పప్పును ఏటా కొనుగోలు చేస్తున్నాం. ఈ ఏడాది కూడా కిలోకు రూ.80 మద్దతు ధరను అమలు చేసి కొనుగోలు ప్రారంభించాం. ఏజెన్సీలోని అన్ని వారపుసంతలతో పాటు జీసీసీ డీఆర్‌డిపోల వద్ద కూడా ఉసిరి పప్పును కొనుగోలు చేపట్టాం. గిరిజనులు జీసీసీకి విక్రయించి మంచి ఆదాయం పొందవచ్చు.

– డి.సింహాచలం, జీసీసీ డీఎం, పాడేరు

రైతు భరోసా లబ్ధి రూ.70.76 కోట్లు

- 1,70,835 మంది ఖాతాల్లో జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



రైతు భరోసా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రైతు భరోసా పథకంలో జిల్లాలో 1,70,835 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా పుట్టపర్తిలో రెండవ విడత రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం స్థానిక కాఫీ అతిథి గృహంలో కలెక్టర్‌తో పాటు గిరిజన రైతులు వీక్షించారు. అనంతరం గిరిజన రైతులకు రూ.70.76 కోట్ల విలువైన రైతు భరోసా చెక్కును కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులంతా ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయం నగదు నేరుగా గిరిజన రైతుల ఖాతాల్లోనే జమ అవుతుందన్నారు. అటవీ భూములకు పట్టాలు పొందిన రైతులకు కూడా రైతు భరోసా అమలుజేస్తున్నామని తెలిపారు. గిరిజన రైతులు కాఫీ పంటను జీసీసీ, ఐటీడీఏ పరిధిలోని చింతపల్లి మాక్స్ సొసైటీలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కిలో రూ.38.40కు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులంతా పౌరసరఫరాలశాఖకు విక్రయించాలని సూచించారు. దళారి వ్యాపారులకు అమ్ముకుంటే మోసపోతారని రైతులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధకశాఖ, పట్టుపరిశ్రమ, స్పైసెస్ బోర్డులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయా శాఖల సేవలపై కలెక్టర్ సమీక్షించారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాలను పర్యటించి పశువులకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు నందు, రమేష్‌కుమార్‌రావు, నరసింహం, అప్పారావు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కన్నాపాత్రుడు పాల్గొన్నారు.

కాఫీ పంటను దళారులకు అమ్మి మోసపోవద్దు

కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని కాఫీ రైతులు కాఫీ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాఫీ గింజలకు డిసెంబర్, జనవరి నెలల్లో మంచి ధర పలికే అవకాశం ఉన్నందున అంతవరకు రైతులు వేచి ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం పాచ్‌మెంట్ కిలో రూ.150 నుంచి రూ.155కు వ్యాపారులకు విక్రయించడం ద్వారా రైతులు నష్టపోతున్నారన్నారు. కిలోకు రూ.300 ధర వచ్చే సమయంలో అమ్మకాలు జరుపుకోవాలని ఆయన కోరారు. పాడేరు ఐటీడీఏ ఈ ఏడాది కాఫీ పండ్ల కొనుగోలు ధర కిలో రూ.43 ప్రకటించిందన్నారు. కాఫీ పండ్లు సరఫరా చేసిన వారం రోజుల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతాయన్నారు.పల్పింగ్ చేసి కాఫీ గింజల మార్కెటింగ్ అనంతరం వచ్చే లాభాలను తిరిగి ఆయా రైతులకు బోనస్‌గా పంపిణీ చేస్తామన్నారు. గతేడాది కిలో కాఫీ పండ్లను రూ.36తో కొనుగోలు చేశారన్నారు. అమ్మకాల అనంతరం కిలోకు రూ.8 చొప్పున బోనస్ పంపిణీ చేశారన్నారు.ప్రైవేటు వ్యాపారులకు కాఫీ పండ్లను విక్రయిస్తే తూకంలో మోసాలకు పాల్పడతారని కొంత మేర తరుగు కూడా తీస్తారన్నారు. నాణ్యమైన కాఫీ పండ్లను మాత్రమే కొంటారని ఆయన తెలిపారు. ఇలాంటి మోసాలకు గురికాకుండా చింతపల్లి మాక్స్ సంస్థ అన్ని రకాల కాఫీ పండ్లను కొనుగోలు చేస్తుందని, రైతులు అప్రమత్తంగా ఉండి గిట్టుబాటు ధరకే అమ్ముకోవాలని కలెక్టర్ సూచించారు.

పాడేరు ఘాట్ రోడ్డులో కూలిన చెట్టు





పాడేరు ఘాట్ రోడ్డులో అడ్డంగా కూలిన చెట్టు, చెట్టు తొలగింపు అనంతరం ప్రారంభమైన వాహన రాకపోకలు

సుమారు రెండు గంటల సేపు ట్రాఫిక్ జామ్

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన ఘాట్‌రోడ్డులో మంగళవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా చెట్టుకూలింది. దీంతో సుమారు రెండు గంటలసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి వంట్లమామిడి జీడిమామిడి తోట అవతల చెట్టు కూలిపోయింది. దీంతో సమారు కిలోమీటరు పొడవునా రెండు వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందుల పడ్డారు. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ పాడేరు ఈఈ బాలసుందరబాబు హుటాహుటిన సిబ్బందిని,కూలీలను చెట్టు కూలిన ప్రాంతానికి పంపించారు. వారు సుమారు రెండు గంటలపాటు శ్రమించి కూలిన చెట్టును తొలగించారు. రాత్రి 9 గంటల తరువాత వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి.

వర్షం కురిసినప్పుడల్లా ఇదే సమస్య..

ఘాట్‌రోడ్డులో వర్షం కురిసినప్పుడల్లా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో చెట్లు కూలుతున్నాయి. వాహనాలు రోడ్డుపక్కకు దిగితే దిగబడిపోతున్నాయి. దీనివల్ల తరచూ వాహనచోదకులు, ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

నేడు, రేపు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన

పాడేరు రూరల్ : రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు ఈనెల 8,9 తేదీల్లో జిల్లాలోని పాడేరు, అరకువేలీ ప్రాంతాల్లో పర్యటిస్తారని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తేదీ ఉదయం 10 గంటలకు పాడేరులో మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. అనంతరం పాడేరు మండలం లింగాపుట్టు గ్రామంలో పర్యటించి అక్కడి గిరిజనులతో మాట్లాడతారన్నారు. అక్కడి నుంచి 12 గంటలకు బయలుదేరి పాడేరు పీఎంఆర్సీ భవనానికి చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అట్రాసిటీ కేసులతో పాటు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తారన్నారు. సాయంత్రం ఐదు గంటలకు పాడేరులో బయలుదేరి అరకువేలి ఏపీటీడీసీ అతిథి గృహానికి చేరుకొని స్థానిక గిరిజన నేతలతో ముచ్చటిస్తారని తెలిపారు. మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకు అరకువేలీ మండలంలో ఏదొక గిరిజన గ్రామాన్ని సందర్శించి అక్కడి వారితో సమావేశమవుతారని పీవో పేర్కొన్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు గిరిజన మ్యూజియాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనం అనంతరం విజయనగరానికి బయలుదేరి వెళ్తారన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని పీవో ఆదేశించారు.

ఆర్చరీ పోటీల్లో గిరి యువకుడి ప్రతిభ

జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన దేశాయ్



దేశాయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తదితరులు

అరకులోయ టౌన్: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్. దేశాయ్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ తెలిపారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దేశాయ్ గత నెల 21వ తేదీ నుంచి 24 వరకు వైఎస్సార్ జిల్లా కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ నెల 20 నుంచి 22 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు దేశాయ్ ఎంట్రీ ఫీజు రూ. 8,500 చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మొత్తాన్ని డాక్టర్ పాంగి గణేష్ చెల్లించేందుకు ముందుకు వచ్చారని పీడీ ఎస్. అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా దేశాయ్‌తోపాటు వైద్యుడు గణేష్‌ను అభినందించారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

28 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి



ఉత్తర్వుల కాపీలను అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని పలు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న 28 మంది సెకెండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు వీటిని మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో అభిషేక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ. కొండలరావు, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, గౌరవ అధ్యక్షుడు కుర్తాడి రామారావు పాల్గొన్నారు.

డోలీలో గర్భిణి తరలింపు



గర్భిణిని డోలీలో తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ రాచకిలం గ్రామానికి చెందిన గర్భిణి వెంకటి పొట్టమ్మ (20)ను ఆస్పత్రికి డోలీలో తరలించారు. ఆమెకు మంగళవారం సాయంత్రం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేనందున కుటుంబ సభ్యులు బల్లగరువు గ్రామం వరకు దట్టమైన అటవీ ప్రాంతం గుండా డోలీలో ఏడు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని తీసుకు వచ్చారు. అక్కడినుంచి ఆటోలో పినకోట పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చేర్పించారు.

ముమ్మరంగా కట్టడాల తొలగింపు



కట్టడాలు తొలగింపుతో రోడ్డు మీదకు కనిపిస్తున్న పోలీసుస్టేషన్ భవనం

రాజవొమ్మంగి: ఎన్‌హెచ్ 516ఈ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రాజవొమ్మంగిలో కట్టడాల తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. దీనిలో భాగంగా ఐ. పోలవరం జంక్షన్ నుంచి అడ్డతీగల, రాజవొమ్మంగి మీదుగా కొయ్యూరు మండలం కాకరపాడు వరకు ఈ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు గ్రామాల పొలిమేర్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం జడ్డంగి, వట్టిగెడ్డ, దూసరపాము, రాజవొమ్మంగి గ్రామాల్లో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే సర్వే పూర్తయిన భూభాగాల్లోని కట్టడాలను, అడ్డుగా ఉన్న భారీ చెట్లను సంబంధిత అధికారులు యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు మరుగున ఉన్న స్థానిక పోలీసుస్టేషన్ భవనం ఇప్పుడు రోడ్డు మీదకు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

10న జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 10న క్లరికల్, టెక్నికల్ విభాగాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి (క్లరికల్) సీహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, పేటీఎం, టీసీఎస్ డిజిటల్, శ్రీరామ్ చిట్స్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, పీఎస్‌బీ ఇండస్ట్రీస్, హనీ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 275 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జూనియర్ కెమిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్ అసిస్టెంట్, రికవరీ క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్స్, ప్లాంట్ హెల్పర్ ఉద్యోగాలకు.. ఆయా పోస్టులను బట్టి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ పాసైన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. పోస్టును బట్టి వేతనం నెలకు రూ.15,300 నుంచి రూ.32,500 వరకు ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

జానపద నృత్య పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాయ్

పాడేరు రూరల్ : దేశ ఆర్థిక రాజధాని ముంబైలో జరిగిన జానపద నృత్య పోటీల్లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. గతనెల 27నుంచి ఈనెల 2వరకు జరిగిన 15వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బి.పవన్‌కుమార్ రాజ్, పి.శ్యామ్, మత్స్యరాజు, బి.కళావతి, ఎస్.శాంతి, ఎస్.దివ్య, ఎస్.సుమిత్ర అనే విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయలకు అద్దం పట్టేలా జానపద గేయాలతో పాటు జానపద నృత్యాలను ప్రదర్శించి మొదటి బహుమతి కైవశం చేసుకున్నారు. వీరికి మహారాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రూ.15వేల నగదు అందజేశారు. జానపద నృత్యాలతో పాటు అనువాదం, క్రమశిక్షణ వంటి అంశాల్లో కూడా మొదటి స్థానాల్లో నిలిచారు. వీరిని మంగళవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వనుము చిట్టిబాబ్యాయ్, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, సీనియర్ అధ్యాపకులు కోటేశ్వరరావు, రమేష్‌బాబు, గౌరీశంకర్, కళాశాల పీడీ ప్రసాద్‌నాయుడు అభినందించారు.

మొక్కవోని 'ఉక్కు' సంకల్పం

- నేటికి దీక్షలు ప్రారంభించి వెయ్యి రోజులు
- నేడు అన్ని జిల్లాల్లో ర్యాలీలు
- జిల్లాలోని విద్యా సంస్థలు బంద్


జాతీయ రహదారిపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల బైక్ ర్యాలీ

ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి వెయ్యి రోజులు పూర్తిచేసుకోనున్నాయి. స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలని 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక వర్గం భగ్గుమంది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పలు ఆందోళనలు నిర్వహించింది. ఢిల్లీలో రెండు రోజులు ధర్నాలు చేపట్టారు. ముఖ్యంగా జాతీయ రహదారిని రెండు రోజుల పాటు దిగ్బంధించారు. స్టీల్ ప్లాంట్ పరిపాలన భవనం ముట్టడి, గేట్ల ముట్టడి చేపట్టారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పింది. ఇందులో భాగంగా అమ్మకాల ప్రక్రియలకు ట్రాన్సాక్షన్, లీగల్ అడ్వైజర్ల నియామకాలు చేపట్టింది. ఉక్కు ఉద్యమానికి బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, రచయితలు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు మద్దతిస్తూ దీక్షల్లో పాల్గొంటున్నాయి. దీక్షలు ప్రారంభించి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం వివిధ రూపాల్లో ఆందోళన చేయనున్నారు.

నేడు ర్యాలీలు, విద్యా సంస్థలు బంద్

దీక్షలు ప్రారంభించి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా బుధవారం వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, రైతు సంఘాలు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ర్యాలీలు జరగనున్నాయి. అదే విధంగా కళాశాలలు, పాఠశాలలు బంద్ పాటించనున్నాయని ఉక్కు పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

రాజకీయ పార్టీలతో సమన్వయ కమిటీ



ఇప్పటివరకు కార్మిక సంఘాలు పోరాటాలు చేశాయి. ఇకపై రాజకీయ పార్టీలకు ఆ బాధ్యత అప్పగించనున్నాం. రాజకీయ పార్టీల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచనున్నాం. స్టీల్‌ప్లాంట్‌ను సొంతంగా నిర్వహించాలి లేదా సెయిల్‌లో విలీనం చేయాలనే నినాదంతో ముందుకు సాగుతాం.

– డి.ఆదినారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్

మొండి వైఖరి తగదు



కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పట్ల మొండి వైఖరి అవలంబిస్తోంది. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మేథావి వర్గాలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. ఇదే వైఖరి కొనసాగిస్తే బీజేపీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

– మంత్రి రాజశేఖర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్యంగా వెయ్యి రోజులపాటు ఆందోళనలు చేశాం. రాష్ట్రం విడిపోయిన తర్వాత కొత్త పరిశ్రమలు ఇవ్వకపోగా ఉన్న పెద్ద పరిశ్రమను ప్రైవేటీకరించాలని చూడటంపై ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాల్సి ఉంది.

– జె.అయోధ్యరామ్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కోకన్వీనర్

ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం

నలుగురు పోలీసులను ఆర్మ్‌డ్ రిజర్వుకు అటాచ్ చేసిన ఎస్పీ


ఆర్మీ ఉద్యోగిని వ్యానులో ఎక్కించడానికి ప్రయత్నిస్తున్న పోలీసులు

పరవాడ: దిశ యాప్ డౌన్‌లోడ్ విషయంలో పరవాడ పోలీసులు ఓ ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన పరవాడలో కలకలం సృష్టించింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పరవాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు పోలీసులు మంగళవారం స్థానిక వారపు సంతలో దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు సంతకు వచ్చే వినియోగదారులను దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ ఆర్మీ ఉద్యోగిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు కోరారు. ఆయన కూడా వెంటనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్పగా.. పోలీసులు రాసుకున్నారు. ఇంతలో ఆర్మీ ఉద్యోగికి అనుమానం వచ్చి.. మీకు నేమ్ ప్లేట్ లేదు.. మీ ఐడీ కార్డు చూపించాలని పోలీసులను కోరాడు. దీంతో ఓ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మమ్మల్ని ఐడీ కార్డు అడుగుతావా? అంటూ అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్‌తో కలిసి ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం చేశారు. ఆర్మీ ఉద్యోగిని పోలీస్ స్టేషన్‌కు తరలించడానికి బలవంతంగా వ్యాను ఎక్కించే ప్రయత్నం చేశారు. చివరకు ఆర్మీ ఉద్యోగి ఐడీ కార్డును తీసుకుని వదిలేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పరవాడలో తమపై ఓ ఆర్మీ ఉద్యోగి దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసు సిబ్బంది స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు పోలీసులను ఆర్మ్‌డ్ రిజర్వుకు అటాచ్ చేస్తూ, విచారణకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

డీసీఐఎల్ లాభం రూ.16.77 కోట్లు

డొండపర్తి(విశాఖ): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రెండో క్వార్టర్‌లో అద్భుతమైన లాభాన్ని ఆర్జించింది. రూ.198.59 కోట్ల టర్నోవర్ సాధించి రూ.16.77 కోట్లు లాభం సొంతం చేసుకుంది. షేర్ విలువ కూడా రూ.5.99 పెరిగింది. 2023–24లో రూ.1200 కోట్లు టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. డీసీఐఎల్, వీపీఏ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, డీసీఐఎల్ ఎండీ అండ్ సీఈఓ కెప్టెన్ ఎస్.దివాకర్ సంస్థ సాధించిన ప్రగతి పట్ల అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

ఉత్సాహంగా రిమ్ జిమ్ పోటీలు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో రెండో రోజు రిమ్ జిమ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండో రోజు జరిగిన పోటీల్లో విద్యార్థులకు లలిత కళల విభాగంలో మట్టితో బొమ్మలు తయారీ, పోస్టర్ మేకింగ్, థియేటర్ ఆర్ట్స్ విభాగంలో యోగా, ఏకపాత్రాభినయం, బృందగానం పోటీలు, సాహిత్య విభాగంలో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో కథలు చెప్పుట, కథలు రాయుట, బొమ్మను చూసి దాని గురించి విశ్లేషించుట, స్పెల్ బీ, సుడోకు, మ్యాప్ పాయింటింగ్, ప్రాజెక్ట్స్ క్విజ్ వంటి పోటీలు, ఆటలు, క్రీడల విభాగంలో రిలే పరుగు పందాలు, ఖో ఖో, వాలీబాల్ వంటి అనేక పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

12 నుంచి ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు మణవాళ మహామునుల తిరునక్షత్ర పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే 23 నుంచి 27వ తేదీ వరకు తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు జరిపిస్తామన్నారు. ఈ సందర్భంగా పై తేదీల్లో స్వామివారి ఆర్జిత సేవలైన సహస్ర నామార్చన, స్వర్ణ పుష్పార్చన, స్వర్ణ తులసీదళార్చన, గరుడసేవ, నిత్య కల్యాణం సేవలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన స్వాతి హోమం యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

12న సాయంత్రం 6 వరకే దర్శనాలు

ఈ నెల 12న దీపావళి సందర్భంగా స్వామి వారి దర్శనాలు ఆ రోజు సాయంత్రం 6గంటల వరకు మాత్రమే లభిస్తాయని తెలిపారు. అలాగే ఈ నెల 23న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా, 27న ఆలయంలో వృశ్చిక దీపారాధనను పురస్కరించుకుని ఆయా తేదీల్లో రాత్రి 7గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని తెలిపారు. 23, 27తేదీల్లో రాత్రి ఆరాధన టిక్కెట్లు రద్దు చేసినట్టు తెలియజేశారు. భక్తులు ఈ విషయాలను గమనించాలని కోరారు.


ముగిసిన ఖోఖో శిక్షణ శిబిరం


రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్న ఖోఖో జట్లతో కోచింగ్ క్యాంప్ నిర్వాహకులు

రేపటి నుంచి చిత్తూరులో రాష్ట్ర స్థాయి పోటీలు

అగనంపూడి (విశాఖ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనున్న జట్లకు శిక్షణ శిబిరం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అండర్–14 (బాలురు, బాలికల) జట్లకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు కోచింగ్ క్యాంప్ నిర్వహించి, ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు పర్యవేక్షణలో పీడీలు లక్ష్మీరాణి, శ్యామ్, వీరు నాయుడు ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు వారం రోజుల పాటు సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ పొంది, ఆటలో మెలకువలు నేర్చుకుని, ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధులు కావడం సంతోషంగా ఉందన్నారు. పోటీలో సత్తా చాటి ఉమ్మడి విశాఖ జిల్లాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

లేపాక్షిలో హస్తకళల ప్రదర్శన, విక్రయాలు


కళాకారులు రూపొందించిన బొమ్మలు

డాబాగార్డెన్స్ (విశాఖ): లేపాక్షి, జగదాంబ షోరూమ్‌లో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ హస్త కళాకారులు రూపొందించిన వస్తువులను నేరుగా విక్రయిస్తున్నట్లు షోరూం మేనేజర్ కార్తీక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6న ప్రారంభమైన ఈ విక్రయాలు ఈ నెల 11 వరకు ఉంటాయని తెలియజేశారు. ఈ ప్రదర్శనలో నరసాపూర్ లేస్, ఏటికొప్పాక బొమ్మలు, రాజమండ్రి కర్రబొమ్మలు, అనంతపురం తోలు బొమ్మలు, కొండపల్లి బొమ్మలను హస్తకళాకారులు నేరుగా విక్రయిస్తున్నారని చెప్పారు. హస్త కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

బాణసంచా స్వాధీనం


అమనాంలో స్వాధీనం చేసుకున్న బాణసంచా

తగరపువలస (భీమిలి): భీమిలి మండలం అమనాం పంచాయతీలో అనుమతి లేకుండా నిల్వ చేసిన బాణసంచా సామగ్రితోపాటు ఇద్దరు వ్యక్తులను సిటీ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరకులో మందుగుండు తయారీకి వినియోగించే 18 కిలోల పౌడర్, 650 తారా జువ్వలు ఉన్నాయి. వీటితోపాటు ఇద్దరు వ్యక్తులను భీమిలి పోలీసులకు అప్పగించారు.

తండ్రి చెంతకు తనయుడు

'సాక్షి' వార్తతో ధారకొండలో లభించిన విద్యార్థి ఆచూకీ


విద్యార్థి మోహన్‌రావు

గూడెంకొత్తవీధి: అదృశ్యమైన విద్యార్థి తండ్రి చెంతకు చేరాడు. పాఠశాలకు వెళతానని చెప్పి బయలుదేరిన గాలికొండ పంచాయతీ అకులూరుకు చెందిన వంతల మోహన్‌రావు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటనపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తతో ఆచూకీ లభించింది. సాక్షి దినపత్రికలో బాలుడు ఫొటో చూసిన ధారకొండ ప్రాంతానికి చెందిన యువకుడు.. బాలుడి తండ్రికి ఫోన్ చేశాడు.

దీంతో బాలుడు మంగళవారం తండ్రి చెంతకు చేరాడు. దసరా సెలవుల అనంతరం మోహన్‌రావు ఏడుగురు విద్యార్థులతో కలిసి ముంచంగిపుట్టులో పాఠశాలకు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన తరువాత ఎవరికీ చెప్పకుండా వచ్చేశాడు. అయితే ఇంటికి చేరలేదు. ఇదే సమాచారం ఉపాధ్యాయులు తండ్రి సుబ్బారావుకు చెప్పడంతో ఆయన విలేకరులకు తెలిపారు. సాక్షిలో వార్త రావడంతో విద్యార్థి ఆచూకీ దొరికింది. ఈ సందర్భంగా సుబ్బారావు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- క్షేత్రస్థాయిలో లోపాలు అధిగమించాలి
- ఆర్డీవో జయరాం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు పరిశ్రమల భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పరిశ్రమల నిర్వాహకులకు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కర్మాగారాల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల భద్రతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ పరిశ్రమల్లో లోపాలను అధిగమించాలన్నారు. పరిశ్రమలను ప్రజలతో అనుసంధానం చేసి ప్రమాదాలపై అప్రమత్తం చేయాలన్నారు. మాక్ డ్రిల్ తరచూ నిర్వహించాలన్నారు. భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల నిర్వాహకులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చినట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో అమలవుతున్న భద్రతా చర్యలపై చర్చించడమే లోకల్ క్రైసిస్ గ్రూపు సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆఫ్ సైట్, ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రణాళిక పరిశ్రమల్లో పటిష్ఠంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెట్రో, హెచ్‌పీసీఎల్, వివిఎస్ పీఎల్, శ్రీసాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్, పయనీర్ అల్యూమినియం, కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిశ్రమల అధికారులు తమ పరిశ్రమల్లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై ప్రత్యేక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం తహసీల్దార్ అన్నాజీ రావు, ఫైర్, పోలీసు సిబ్బంది, కేశవరం సర్పంచ్ ఎం.గోవింద్ పాల్గొన్నారు.

మిలట్రీ కాలనీలో అగంతకుడి కలకలం


పట్టణంలోని మిలట్రీ కాలనీలో స్థానికులు పట్టుకున్న అగంతకుడు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పట్టణంలోని మిలట్రీ కాలనీలో మంగళవారం రాత్రి అగంతకుడొకరు కొన్ని ఇళ్లలోకి చొరబడి కలకలం సృష్టించాడు. రాత్రి 8 గంటల సమయంలో రాంనగర్ రైల్వేగేటుకు సమీపంలో ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన 20 ఏళ్ల యువకుడ్ని స్థానికులు పట్టుకోవడానికి యత్నించగా తప్పించుకుపోయాడు. ఆ తర్వాత ట్యూషన్‌కు వెళ్లి వస్తున్న ఇద్దరు బాలికల్లో ఒకరి చేయి పట్టుకుని లాక్కుపోవడానికి ప్రయత్నించిన ఆ యువకుడ్ని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. హిందీలో మాట్లాడుతున్న ఆ యువకుడి వద్ద లభించిన ఆధార్ కార్డులో జార్ఖండ్ రాష్ట్రానికి సంబంధించిన అడ్రస్ ఉంది. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణంలో ఇటీవల మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి హల్‌చల్ చేస్తున్న అపరిచిత వ్యక్తులు హడలెత్తిస్తున్నారు. ఈ విషయంపై మిలట్రీ కాలనీవాసులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

రోలుగుంట : అత్తవారింటికి వడ్డిప వెళ్తానని రావికమతం మండలంజెడ్.కొత్తపట్నంలో పుట్టింటి నుంచి బయలుదేరిన పెదపూడి లక్ష్మి అనే మహిళ అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ సురేష్ విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెదపూడి లక్ష్మికి పదేళ్ల క్రితం రోలుగుంట మండలం వడ్డిప గ్రామానికి చెందిన పెదపూడి అడవిరాజుతో వివాహమైంది. గతేడాదిగా ఆమె మానసిక వ్యధతో బాధపడుతోంది. తరుచూ ఇంటి నుంచి వెళ్లిపోవడం, మళ్లీ తిరిగి రావడం జరుగుతోంది. ఈ నెల 1న కూడా పుట్టింటి నుంచి అత్తవారింటికి వచ్చేందుకు బయలుదేరింది. ఇంత వరకూ ఆమె వడ్డిప భర్త వద్దకు వెళ్లలేదు. పుట్టింటికీ తిరిగి చేరలేదు ఆదివారం వరకూ ఎదురు చూసిన తల్లి ఎల్లమ్మ సోమవారం పోలీసులను ఆశ్రయించింది.

పాము కాటుతో మహిళ మృతి

పాయకరావుపేట : మండలంలో గల నామవరం గ్రామానికి చెందిన చందక సూర్యకాంతం (58) అనే మహిళ సోమవారం పాము కాటుకు గురై మృతి చెందడం జరిగిందని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం సూర్యకాంతం పొలంలోనికి వెళ్లి పని చేస్తుండగా గుర్తు తెలియని విషసర్పం కాలిపై కుట్టడంతో నొప్పితో బాధపడుతూ ఆమె ఇంటికి వచ్చేసింది. ఇంటికి వచ్చిన వెంటనే తన నోటి నుంచి నురగ రావడంతో కింద పడిపోయింది. ఆమెను తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించింది. మృతురాలి కుమారుడు భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.